12న ఉద్యోగులకు క్రీడా పోటీలు

బెలగాం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు ఈ నెల 12న పలు విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానం ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పురుష, మహిళ సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొని సత్తా చాటాలని కోరారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలైన వారిని ఈ నెల 19 నుంచి జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని వెల్లడించారు.



పార్వతీపురం టౌన్: మల్లికార్జునస్వామి ఆలయంలో ...

కార్తీక శోభ

- ఆలయాలు కిటకిట
- భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు
- వైభవంగా దీపోత్సవం, జ్వాలా తోరణం

పార్వతీపురం, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు బుధవారం కార్తీక పౌర్ణమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే నదీ స్నానాలు ఆచరించి దీపారాధన చేశారు. అనంతరం శివాలయాలకు చేరుకున్నారు. ముక్కంటిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దీంతో అంతటా శివనామస్మరణ మార్మోగింది. ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. మరోవైపు మహిళలు ఉదయం నుంచి ఉపవాస దీక్షలు చేశారు. సాయంత్రం ఇళ్లలో ప్రత్యేక పూజలు, నోములు నోచారు. వివిధ రకాల పిండి వంటకాలతో పాటు బూరెలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. ఇక జిల్లాలోని పలు శైవక్షేత్రాల్లో దీపోత్సవం, జ్వాలాతోరణం వంటి కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై వేడుకలను తిలకించారు. మొత్తంగా అంతటా కార్తీక సందడి నెలకొంది.

కార్తీక పున్నమి వేళలో.. 6లో



సీతంపేట రూరల్: సీతంపేటలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారి ఉత్సవమూర్తులు

బాలికలు అక్కడ బాలురు ఇక్కడ!

- ఇదీ అనసభద్ర 'ఏకలవ్య'లో పరిస్థితి
- తీవ్రంగా వేధిస్తున్న వసతి సమస్య
- పది గదులతో 315 విద్యార్థులకు తప్పని అవస్థలు
- అంతంతమాత్రంగా తాగునీటి సౌకర్యం
- ప్రహరీ నిర్మాణం చేపట్టని వైనం
- 144 మందికి కొటికపెంటలో తరగతులు
- ఉన్నతాధికారులు స్పందించాలని విన్నపం



అనసభద్ర ఏకలవ్య పాఠశాల

మక్కువ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మక్కువ మండలం అనసభద్ర సమీపంలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థులను వసతి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. తాగునీరు, ప్రహరీ ఇతరత్రా సమస్యలు కూడా వెంటాడుతున్నాయి. డార్మెటరీ లేక ఇక్కడుండాల్సిన బాలికలను వేరే పాఠశాలకు పంపించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాస్తవంగా ఈ 'ఏకలవ్య'ను ఎర్రసామంతవలసలోని ఆశ్రమపాఠశాలలో సుమారు మూడేళ్ల పాటు నిర్వహించారు. ఈ ఏడాది జనవరిలో అనసభద్ర వద్ద నిర్మించిన కొత్త భవనాల్లోకి మార్చారు. రూ.17కోట్ల వ్యయంతో పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో పాఠశాల భవనాల నిర్మాణం చేపట్టారు. అయితే రెండు అంతస్థుల్లో 20 గదులు నిర్మించాల్సి ఉండగా కింద అంతస్థులో 10 గదులను మాత్రమే నిర్మించి పాఠశాలకు భవనాలను అప్పగించారు. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం వరకు 315మంది బాలురు, 144మంది బాలికలు చదువుతున్నారు. అయితే వసతి సమస్యతో పాటు ప్రహరీ లేని కారణంగా ఇక్కడ చదువుకోవాల్సిన 144మంది బాలికలను పాచిపెంట మండలం కొటికిపెంట ఏకలవ్యకు తరలించారు. అయితే ఇప్పటికే అక్కడున్న ఆ పాఠశాల విద్యార్థినులతో సర్దుకుంటూ వారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా పాఠశాల రెండో అంతస్థులో పది గదుల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోగా, 315 మంది

(మిగతా 8వ పేజీలో...)



పాఠశాల పై అంతస్థులో గదులు నిర్మించని దృశ్యం

ప్రతిపాదనలు పంపించాం..

'సుమారు రూ.12 కోట్లతో అనసభద్ర ఏకలవ్య పాఠశాల కింద అంతస్థులో పది గదుల నిర్మాణం పూర్తి చేశాం. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపించాం. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. రూ.10లక్షలతో మూడు బోర్లు నిర్మాణానికి ప్రతిపాదించాం. రెండో బోరును రోడ్డుకు అవతల వైపు నిర్మించాం. నాలుగు రోజుల్లో కనెక్షన్ ఇచ్చి పాఠశాలకు తాగునీటిని సరఫరా చేస్తాం. ఇకపోతే సీసీరోడ్లు, కాలువల నిర్మాణానికి 60లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం.' అని పార్వతీపురం ఐటీడీఏ ఏఈ పీవీ సత్యనారాయణ తెలిపారు.

విధి నిర్వహణలో అప్రమత్తం

- ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎస్ఐలకు ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ప్రాక్టికల్ శిక్షణ కోసం జిల్లాకు కేటాయించిన 37 మంది నూతన ప్రొబెషనరీ ఏపీఎస్పీ ఆర్ఎస్ఐలు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా వారికి ఎస్పీ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వారి వెంట డీఎస్పీ థామస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఆర్ఎస్ఐలకు సూచనలిస్తున్న ఎస్పీ

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం 6లో

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి

వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పాఠశాల దశలోనే విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్టు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లావాసులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించేందుకు జిల్లాకు వచ్చిన సీఆర్ఎం బృందంతో బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..' వ్యక్తిగత పరిశుభ్రత లోపం కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నట్టు గుర్తించాం. ఈ నేపథ్యంలో ప్రతి అంగన్‌వాడీ, పాఠశాల, కళాశాలల్లో 'ముస్తాబు' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. మధ్యాహ్న భోజనానికి ముందు.. ఆ తర్వాత విద్యార్థులు చేతులు కడుక్కునేలా చూస్తున్నాం. ఇకపోతే పరిసరాల పరిశుభ్రత లోపం కారణంగానే గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా మలేరియా ప్రబలుతున్నట్లు గుర్తించాం. అధికంగా కేసులు నమోదువుతున్న గ్రామాల్లో 'మన ఊరికి మలేరియా వచ్చింది' అనే కార్యక్రమం చేపడుతున్నాం. దోమల నివారణకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నాం.' అని తెలిపారు.

15 రోజులకొకసారి కళా జాతర

బెలగాం : జిల్లాలో ప్రతిభావంతులైన, ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేందుకు కళాజాతర కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి 15 రోజులకొకసారి సాంస్కృతిక పోటీలు, ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు మన్యంలో కళాకారులు తమ వివరాలను అధికారులకు అందజేయాలని సూచించారు.

నేడు 'కౌశలం ట్రయల్ రన్'

కౌశలం (వర్క్ ఫ్రమ్ హోం) అమలుకు సంబంధించి నేడు జిల్లాలోని 350 గ్రామ, వార్డు సచివాలయాల్లో ట్రయల్ రన్ పరీక్ష నిర్వహించనున్నారని కలెక్టర్ వెల్లడించారు. డ్వామా పీడీ రామచంద్రరావు ట్రయల్ రన్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

6,247 రెవెన్యూ సదస్సులు

- డీఆర్వో హేమలత

బెలగాం, నవంబరు5(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో పూర్తిస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని డీఆర్వో కె.హేమలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు మన్యంలో 6,247 రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సీతానగరంలో 731, పాచిపెంట 639, మక్కువ 591, పార్వతీపురం 548, సీతంపేట 509, జియ్యమ్మవలస 507, భామినిలో 456 సదస్సులు చేపట్టామన్నారు. బలిజిపేటలో 410, గుమ్మలక్ష్మీపురం 381, కొమరాడ 342, పాలకొండ 259, కురుపాం 246, సాలూరు 207, వీరఘట్టం 191, గరుగుబిల్లి 169, సాలూరు అర్బన్‌లో 61 సదస్సులు నిర్వహించినట్లు తెలియజేశారు.

జడ్పీ విభజన జరిగేనా?

- వచ్చే ఏడాది ప్రథమార్థంలో స్థానిక ఎన్నికలు
- ఈలోగా ప్రక్రియ పూర్తి కానుందని అధికార వర్గాల భావన

సాలూరు రూరల్, నవంబరు5 (ఆంధ్ర జ్యోతి): పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు ఉమ్మడిగా ఉన్న జిల్లా పరిషత్‌ను విభజించనున్నారా? త్వరలోనే ఈ ప్రక్రియ చేపట్టనున్నారా? అంటే అవుననే సమాధానం సర్వత్రా వినిపిస్తోంది. విజయనగరం జడ్పీని త్వరలో విభజించే అవకాశాలున్నాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరుతో జడ్పీ పాలక వర్గానికి నాలుగేళ్లు పూర్తయ్యింది. వచ్చే ఏడాది సెప్టెంబరు వరకు పదవీ కాలముంది. అయితే వచ్చే ఏడాది ప్రథమార్థంలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఇటీవల రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడిగా ఉన్న జిల్లా పరిషత్



విభజించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి..

- ఉమ్మడి జిల్లాలో 34 మండలాల ప్రాతిపదికన 2021 ఏప్రిల్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగాయి. వాటి ఫలితాలు

(మిగతా 8వ పేజీలో...)

6లో
గజరాజుల బీభత్సం | జిల్లాలో 'ఫేస్ వాష్ అండ్ గో

తరలిపోతున్నా.. పట్టించుకోరా?

- అటవీ సంపదపై అక్రమార్కుల కన్ను
- యథేచ్ఛగా కలప అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న అటవీశాఖ

సీతంపేట రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో ఎంతో విలువైన అటవీ సంపదపై అక్రమార్కుల కన్ను పడింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా టేకు కలపను అక్రమంగా రవాణా చేస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. యథేచ్ఛగా ఈ దందా సాగుతున్నా.. అటవీశాఖ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. వాస్తవంగా సీతంపేట మండలానికి సరిహద్దులో కడగండి, పొల్ల, చిన్నబగ్గ, పూతికవలస, మర్రిపాడు, కుసిమి, కోతాం, గుడ్డిమీదగూడ, సారంగి గ్రామాలున్నాయి. ఆయా ప్రాంతాల మీదుగా టేకు, నేరడి, చింత, గుగ్గిలం, ఇరిడి కలపను అక్రమార్కులు ప్రైవేట్ వాహనాల ద్వారా మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొండ ప్రాంతంలో కలప చెట్లను యంత్రాలతో కట్‌చేసి రవాణాకు అనువుగా మారుస్తున్నారు. అనంతరం టేకు దుంగలను కర్రల డిపోలకు తరలిస్తున్నారు. పట్టపగలే పాలకొండ- హడ్డుబంగి రహదారి గుండా పాలకొండ, కొత్తూరు అటవీశాఖ కార్యాలయాలు, ఫారెస్ట్ చెక్‌పోస్టులు దాటి కలప తరలిపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. వాల్టా చట్టం నిబంధనల మేరకు ఎవరైనా చెట్టును నరకాలంటే అటవీశాఖ అనుమతి తప్పనిసరి. అంతేకాకుండా ప్రభుత్వానికి చెట్టు విలువ చెల్లించి అదనంగా మొక్కలు నాటాల్సి ఉంది. ఇవేమీ పట్టని అక్రమార్కులు సీతంపేట ఏజెన్సీలోని విలువైన కలపను కొల్లగొట్టేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.



ఓంద్రుజోల- కడగండి మీదుగా టేకు దుంగలను తరలిస్తున్న దృశ్యం

ప్రత్యేక నిఘా పెట్టాం..

'సీతంపేట ఏజెన్సీలో విలువైన కలప అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాం. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తీసుకుం టాం. అటవీ సంపదను పరిరక్షిస్తున్నాం' అని పాలకొండ అటవీశాఖ రేంజ్ అధికారి రామారావు తెలిపారు.

వైద్య సేవలపై ఆరా

- జిల్లాలో పలు ఆసుపత్రులను సందర్శించిన సీఆర్ఎం బృందం

వీరఘట్టం/ కురుపాం/ భామిని/ పాలకొండ, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం కామన్ రివ్యూ మిషన్ (సీఆర్ఎం) బృంద సభ్యులు విస్తృతంగా పర్యటించారు. తొలుత వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్‌సీ భవనం, సమాచార పట్టికలు, నీటి సరఫరా, పారిశుధ్యం తదితర వాటిని పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆ తర్వాత వారు కురుపాం సీహెచ్‌సీ, భామిని మండలంలో బత్తిలి పీహెచ్‌సీని సందర్శించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు, పనితీరుపై వైద్యాధికారులు, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టీబీ బాధితులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. కాలం చెల్లిన సిరప్‌లు ఉండడాన్ని గుర్తించి సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం గ్రామీణ ప్రజలతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకున్నారు. ధింసా బృందంతో వచ్చిన మనుమకొండ సర్పంచ్ కేశవతో మాట్లాడి గిరిజనులు అత్యధికంగా రక్తహీనత సమస్యతో ఎందుకు బాధపడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం పాలకొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై రోగులు, బంధువులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, మెనూ అమలు, మౌలిక వసతు కల్పన, తదితర వాటిపై ఆరా తీశారు. ఏరియా ఆసుపత్రి అందిస్తున్న వైద్యసేవలు, అందుబాటులో ఉన్న వైద్యులు తదితర వాటిపై డీసీహెచ్ఎస్ నాగభూషణరావు వివరించారు. కాగా ఈ నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తామని బృంద సభ్యులు తెలిపారు. ఈ పరిశీలనలో సీఆర్ఎం బృంద సభ్యులు భవానీ సింగ్, అంకుర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ ఏరియా ఆసుపత్రిని పరిశీలిస్తున్న సీఆర్ఎం బృందం

కార్తీక పున్నమి వేళలో..

- ఘనంగా పౌర్ణమి పూజలు
- జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి

కార్తీక పౌర్ణమి పూజలు బుధవారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. వేకువ జామునే భక్తులు నదులు, కాలువలు, చెరువుల్లో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించి తెప్పలు వదిలారు. అనంతరం సమీప ఆలయాల్లో పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

- వేద మంత్రాలతో మార్మోగిన వేదిక

సీతంపేట రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీతంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం టీటీడీ నిర్వహించిన శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు కృష్ణసాయి స్వామి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఈ వేడుక కమనీయంగా జరిపించారు. తిలకించేందుకు సుమారు 2వేల మంది భక్తులు వచ్చారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకు ముందు కల్యాణ వేదిక వద్ద టీటీడీ నుంచి వచ్చిన బృందం హరికథ, అన్నమాచార్య సంకీర్తనలను వినిపించింది. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గిరిజన సలహా మండలి సభ్యులు ఎం.తేజోవతి, సవర మాలయ్య, పాలకొండ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసుడి కల్యాణం జరిపిస్తున్న పండితులు

వేద గాయత్రీమాత సన్నిధిలో మంత్రి అచ్చెన్న



ఆశ్రమంలోని 300 కిలోల గంటను మోగిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు దంపతులు

ఎస్.కోట రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజీపేట సమీపంలో గల శంబలనగరి ఆశ్రమంలో గల వేదగాయత్రీమాతను వ్యవసాయ శాఖ రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దంపతులు బుధవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో దర్శించుకున్నారు. ఇక్కడ ఆశ్రమ ప్రతినిధులు స్వాగతం పలికారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని చేసిన ఏర్పాట్లపై అభినందించారు అనంతరం కార్తీక పున్నమి సందర్భంగా ఏర్పాటుచేసిన ఆకాశదీపాన్ని వెలిగించారు. అలాగే ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు పాల్గొన్నారు.



విజయనగరం: పశుపతినాథేశ్వర స్వామి ఆలయం వద్ద..



గరివిడి: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద..



నెల్లిమర్ల: రామతీర్థంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకులు



డెంకాడ: జ్వాలాతోరణం నిర్వహిస్తున్న దృశ్యం



బొబ్బిలి రూరల్: పెంట గ్రామంలోని అన్నపూర్ణసహిత నగరేశ్వరస్వామి ఆలయంలో..



రేగిడి: సంకిలి వద్ద నాగావళి నదీతీరంలో దీపాలు విడిచిపెడుతున్న భక్తులు



పాలకొండ: నక్కలపేటలోని లలిత మహాత్రిపుర సుందరి సమేత అమృత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం

ఘనంగా పాలకావిళ్ల ఉత్సవం



మామిడిపల్లిలో పాలకావిళ్లతో అయ్యప్పమాల దీక్షాదారులు



సాలూరులో పాలకావిడి మోస్తున్న చిన్నారులు..

సాలూరు/రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం అయ్యప్ప స్వామి మాలధారులు పాలకావిళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు సమీప గ్రామాలైన విశ్వనాథపురం, జీగిరాం, కొత్తవలస, కరాసువలస, పెదబోరబంద, పెదపదం, బాగువలస, శివరాంపురం, కొట్టక్కిల, మామిడిపల్లి, శివరాంపురం గ్రామాలకు చెందిన వందలాది మంది అయ్యప్ప స్వాములు పాలకావిళ్లతో ఊరేగారు. అయ్యప్ప మాలధారులకు అడుగడుగునా పట్టణ ప్రజలు హారతులు పట్టారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల పాలకావిళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పాలకావిళ్లతో అయ్యప్పస్వామి ఆలయానికి చేరుకుని స్వామికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన చేశారు.



ఖడ్గవలసలో వరి పంటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

గజరాజుల బీభత్సం

- జనావాసాల్లోకి చొరబడే యత్నం
- ఖడ్గవలస ప్రధాన రహదారిలోని ఓ ఇంటి గేట్, సామగ్రి ధ్వంసం

గరుగుబిల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో గజరాజుల గుంపు బీభత్సం సృష్టిస్తోంది. నాలుగు రోజులుగా పిట్టలమెట్ట, నాగూరు, సంతోషపురం, ఖడ్గవలసతో పాటు పలు గ్రామాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. కోతకు వచ్చిన వరి పంటను ధ్వంసం చేస్తున్నాయి. బుధవారం ఖడ్గవలస ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కిమిడి శ్రీరామ్మూర్తి నివాసంలోకి చొరబడేందుకు ప్రయత్నించాయి. నివాసానికి ముందు ఉన్న ప్రధాన గేట్లతో పాటు సామగ్రిని ధ్వంసం చేశాయి. గతేడాది శ్రీరామ్మూర్తికి చెందిన రైస్ మిల్లులో చొరబడి సామగ్రితో పాటు బియ్యం, ధాన్యం, నూకలు, తవుడును పాడుచేశాయి. కొన్నేళ్లుగా ఇదే ప్రాంతంలో సంచరిస్తూ ఆందోళనకు గురి చేస్తున్నాయి. గజరాజుల గుంపు ఏ నిమిషం నివాసాల్లోకి చొరబడుతాయోనన్న ఆందోళనలో గ్రామస్థులు ఉన్నారు. గజరాజులు గుంపు కారణంగా నష్టం వాటిల్లిన పంటలను పరిశీలించి ఆదుకోవాలని పలువురు కోరారు.



శిరామ్మూర్తి నివాసం ప్రధాన గేటును ధ్వంసం చేసిన ఏనుగులు

సేవలు సత్వరమే అందాలి

- కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

పూసపాటిరేగ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వసేవలను సత్వరమే అందించాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం పూసపాటిరేగ ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు. తొలుత ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించిన సమయంలో అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు, పెండింగ్‌లో సేవలపై అడిగితెలుసుకున్నారు. నిర్ణీత సమయంలోనే సేవలను అందించాలని సూచించారు. పలు విషయాలను డిప్యూటీ తహసీల్దార్ సంజీవ్ కుమార్‌ను అడిగి తెలుసుకొన్నారు.

అందుబాటులో ఉండాలి

డెంకాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వ సేవలను తక్షణమే అందించాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి డెంకాడ తహసీల్దార్ రాజారావును ఆదేశించారు. డెంకాడ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్న సేవలపై తహసీల్దార్ రాజారావును ఆరా తీశారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండాలని, సయపాలన పాటించకపోతే ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలని, నిర్ణీత సమయంలోగా సేవలను అందించాలని అధికారులకు సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాంసుదర్‌రెడ్డి



లారీ డ్రైవర్ ముఖాన్ని కడిగిస్తున్న పోలీసులు

జిల్లా వ్యాప్తంగా 'ఫేస్ వాష్ అండ్ గో'

- రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

బెలగాం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమాన్నిజిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. బుధవారం వేకువజామున జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో బస్సులు, ప్రైవేట్ ట్రావెల్ బస్సులు, లారీలు, కార్లు తదితర వాహనాలను పోలీసులు ఆపి వారిని నీళ్లతో ముఖం కడిగించి పంపించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయా లేవా, అక్రమ రవాణా ఏమైనా జరుగుతుందా, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళుతున్నారని ఆరా తీశారు. అతివేగంతో వెళ్లవద్దని హితవు పలికారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో రిసెప్షన్ కానిస్టేబుల్స్‌గా నిర్వహిస్తున్న సిబ్బంది స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. బుధవారం జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల అధికారులు, సిబ్బందితో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారులు ఏ కారణంతో పోలీసు స్టేషన్‌కు వచ్చింది తెలుసుకుని వారి ఫిర్యాదులు, చేప్పే విషయాలను శ్రద్ధగా వినాలన్నారు. బాధితులు ఫిర్యాదులు రాయ లేని స్థితిలో ఉంటే వారి ఫిర్యాదులను పోలీసులే రాసే విధంగా చొరవచూపాలన్నారు. ఫిర్యాదుదా రులను పదేపదే, పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పకుండా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు అంశాలను రిజిస్టర్‌లో నమోదు చేసి ఫిర్యాదుదారుడికి రసీదు ఇవ్వాలన్నారు. అనంతరం స్టేషన్ హౌస్ ఆఫీసర్ దృష్టికి తీసుకువెళ్లి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ సౌమ్యలత, వివిధ పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

నేడు జడ్పీ సమావేశం

విజయనగరం టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిం చనున్నట్లు సీఈవో బీవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరుకావాలని, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

గరుగుబిల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టులో 10 లక్షల చేప పిల్లలను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాలకు అండగా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో మత్స్యకారులు, గిరిజనుల సంక్షేమాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ఈ ప్రాజెక్టుపై ఆధారపడిన గిరిజన మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఫింగర్ లింగ్ చేప పిల్లలను విడుదల చేశామన్నారు. ప్రాజెక్టు పరిధిలో నిర్వాసితులైన 200 కుటుంబాలకు జీవనోపాధి అవకాశాలను కల్పించామన్నారు. ప్రాజెక్టు పరిధిలోని మత్స్య సంపద సేకరణకు లీజులకు ఇవ్వకుండా లైసెన్సింగ్ వ్యవస్థను అమల్లోకి తీసుకురావడం జరిగిందన్నారు. తక్కువ రుసుంతో ప్రాజెక్టులో చేపలు పట్టుకునే హక్కును కల్పించామన్నారు. జిల్లాలో మత్స్యశాఖ అధికారి టి.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. వలసలు వెళ్లకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. భద్రగిరి, దుమ్మంగి మత్స్య క్షేత్రం నుంచి చేప పిల్లలను సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, రాష్ట్ర డైరెక్టర్లు అక్కేన మధుసూదనరావు, అంబటి రాంబాబు, పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తం నాయుడు, తవిటినాయుడు, నారాయణస్వామి, ముదిలిబాబు, విజయవాంకుశం, ఎంపీటీసీ సభ్యుడు ఎం.సింహాచలంనాయుడు, జనసేన మండల కన్వీనర్ బోను శివ, ఐటీడీఏ ఏపీవో పి.మురళీధర్, సిబ్బంది చాందిని, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లి ప్రాజెక్టులో చేప పిల్లలను విడిచిపెడుతున్న విప్ జగదీశ్వరి

పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెంచండి

- డీఎంహెచ్‌వో జీవనరాణి

డెంకాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతా, శిశు సంరక్షణపై వైద్య సిబ్బంది శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జీవనరాణి తెలిపారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలను పెంచాలని ఆదేశించారు. బుధవారం డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించి, సిబ్బంది హాజరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణ కార్యక్రమాల్లో శ్రద్ధ వహించాలని సిబ్బందికి ఆదేశించారు. టీకాలు కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్య క్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్‌కుమార్, పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ కె.దుర్గారావు, ఫార్మాసిస్టు అప్పలనాయుడు, స్టాఫ్‌నర్సు మీనాకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

42 లక్షల మొక్కల పంపిణీ లక్ష్యం: డీఎఫ్‌వో



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎఫ్‌వో కొండలరావు

విజయనగరం టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 ఏడాదిలో 42లక్షలు మొక్కలు పంపిణీ లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా అటవీశాఖాధికారి ఆర్.కొండలరావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో అటవీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అటవీ భూముల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అటవీ భూములు ఆక్రమణకు గురైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో అనుమతులు లేకుండా కలపను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రేంజ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల భవనంలో సేవలు

● ప్రారంభానికి నోచుకోని వైనం కొత్త భవనం ● ఇదీ సంకిలి గ్రామ సచివాలయంలో పరిస్థితి

రేగిడి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకిలి గ్రామ సచివాలయంలో సమస్యలు తిష్టవేశాయి. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకున్నా, అక్కడి నుంచే సేవలందించాల్సివస్తోంది. ప్రధానంగా శ్లాబ్ పెచ్చులూడుతుండడంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.వర్షంపడితే కారిపోతుండడంతో సిబ్బంది అవస్థలకు గురవుతున్నారు. ఇక్కడ గ్రేడ్-3 సెక్రటరీ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జిలతో సేవలందించాల్సివస్తోంది. ఐదువేల జనాభా ఉండే ఈ సచివాలయం పరిధిలో సంకిలి, అప్పాపురం పంచాయతీల్లోని బొడ్డవలస, చిన్నయ్యపేట, మజ్జిరామునిపేట గ్రామాలు ఉన్నాయి. అయితే ఇక్కడి సచివాలయానికి దాదాపు రూ. 40 లక్షలతో కొత్తభవనం నిర్మాణం పూర్తయినా పంచాయతీకి అప్పగించకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో పాడుబడిన భవనంలో నెట్టుకురావాల్సివస్తోంది. సచివాలయ భవనం నిర్వహణకు అసౌర్యంగా ఉందని ఇప్పటికే ఈ విషయం అధికారులకు తెలియజేసినట్లు సర్పంచ్ బి.పట్టాబి పేర్కొన్నారు. తక్షణమే కుటమి ప్రభుత్వం కొత్త భవనం పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన గదిలో సచివాలయం నిర్వహిస్తున్న దృశ్యం

బిడ్డలను రక్షించబోయి.. నదిలో కొట్టుకుపోయి

● కార్తీక స్నానాలకు వెళ్లిన మహిళ వేగావతిలో పడి మృతి



సంతు (ఫైల్)

బాడంగి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పుణ్య స్నానాలకు వెళ్లిన ఆ కుటుంబానికి విషాదమే మిగిలింది. నదీ ప్రవాహం నుంచి బిడ్డలకు రక్షించబోయి ఓ తల్లి నదిలో కొట్టుకుపోయి మృతిచెందిన ఘటన బుధవారం ఆనవరంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన అంపావిల్లి సంతు (30) బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా వేగావతినదిలో స్నానాలకు కుమారుడు, కుమార్తెతో కలిసివెళ్లింది. దుస్తులు సర్దుకుని ఆమె నదిలో స్నానానికి దిగుతుండగా, ఆమెకన్నా ముందుగానే కుమారుడు, కుమార్తె నదిలో దిగారు. నదీ ప్రవాహం అధికంగా ఉండడాన్ని గమనించిన ఆమె పిల్లల చేయి పట్టుకుని లాగి ఒడ్డుకుచేర్చింది. ఈక్రమంలో ఆమె కాలుజారడంతో నదిలో పడిపోయింది. నదీ ప్రవాహం అధికంగా ఉండడంతోపాటు ఆ ప్రాంతంలో లోతుగా ఉండడంతో ఆమె నదిలో కొట్టుకుపోయింది. ఆమె కోసం గాలిస్తుండగా కారాడ వాటర్‌ట్యాంకు దగ్గర ఆచూకీ లభించింది. ప్రాణం ఉందేమోనని స్థానిక సీహెచ్‌సీకి బంధువులు తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్టు డాక్టర్ కీర్తి తెలిపారు. కార్తీక పౌర్ణమి రోజున నదీ స్నానాలకు భార్యాపిల్లలు వెళ్తే పుణ్యం వస్తుందని తలిస్తే తీవ్ర విషాదమే మిగిలిందని భర్త అనంత్‌కుమార్ కన్నీరుమున్నీరయ్యాడు. సంతు కుమార్తె కీర్తి ఎనిమిదో తరగతి రేజేరులో, కుమారుడు చరణ్ నాలుగో తరగతి ఆనవరంలో చదువుతున్నారు. సంతు భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.

ద్విచక్రవాహన చోదకునికి గాయాలు

రాజాం/రూరల్, నవంబరు5 ఆంధ్రజ్యోతి):రాజాంలోని పాలకొండ రోడ్డులో బుధవారం ఓ ద్విచక్రవాహన చోదకుడు గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. రాజాంలోని కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కూన వెంకటరమణ ద్విచక్రవాహనంపై డోలపేట నుంచి వెళ్తున్నాడు. ఆ సమయంలో పాలకొండరోడ్డులో ఆటోలో నుంచి టైర్లు దింపుతున్నారు. ఈక్రమంలో ఓ టైరు రోడ్డుపై దొర్లుకుంటూ ద్విచక్రవాహనానికి ఢీకొంది.దీంతో ఆ వాహనం పల్టీకొట్టడంతో వెంకటరమణ గాయపడ్డాడు. ఆ సమయంలో ఆ మార్గంలోలో వెళ్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గమణించి వెంకటరమణను తన కాన్వాయ్‌లో సమీపంలోగల ఆసుపత్రికి తరలించారు.

గోస్తనీలో ఇసుక తరలింపుపై వివాదం

● జామి వద్ద అడ్డుకున్న గ్రామస్థులు



ట్రాక్టర్‌కు అడ్డంగా నిలబడి నిరసన తెలుపుతున్న జామి గ్రామస్థులు

జామి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జామి వద్ద గోస్తనీనదిలో ఇటీవల కురిసిన వర్షాలకు కొందరు ఇళ్ల నిర్మాణాలకు సేకరించిన ఇసుకను పంచాయతీ సిబ్బంది తరలింపునకు బుధవారం సిద్ధంకావడంతో వివాదం నెలకొంది. ఇసుక తరలింపును గ్రామస్థులు అడ్డుకున్నారు. జామి వద్ద గోస్తనీనదిలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇసుక చేరింది. ప్రభుత్వం ఇళ్ల మంజూరు చేయడంతోపాటు మరమ్మతులకోసం కొందరు ఇసుకను సేకరించి పోగులు పెట్టారు. ఇంతలో పంచాయతీ సిబ్బంది ప్రభుత్వ పనులకు ఇసుక అవసరమని యంత్రాలతో నదిలోకి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఇసుకను సేకరించిన కొందరు వ్యక్తులు అక్కడకు వచ్చి అడ్డుకున్నారు. ఇసుక సేకరించడానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని పంచాయతీ సిబ్బంది వారిని ప్రశ్నించారు. ఆ సమయంలో జామి గ్రామస్థులకు మద్దతుగా మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకటత్రివేణి, బీజేపీ మండలాధ్యక్షురాలు రాయవరపు అదిలక్ష్మి చేరుకున్నారు. పేదలు కష్టపడి సేకరించిన ఇసుకను ఎలా తరలిస్తారని నిలదీయడంతో చేసేదిలేక పంచాయతీ సిబ్బంది వాహనాలతో వెనుదిరిగారు. కాగా పంచాయతీలో చేసే పనులకు ఈ ఇసుక తీసుకెళ్తున్నామని ఇక్కడ తవ్వినవారికి అనుమతులు లేవని సర్పంచ్ లక్ష్మి తెలిపారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు: సీఐ

విజయనగరం క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలిస్తే యాజమానులతో పాటు తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ సూరినాయుడు హెచ్చరించారు. బుధవారం విజయనగరంలోనిట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డ మైనర్లకి సంబంధించి వాహన యాజమానులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికకు రియాక్షన్ ఇచ్చిన డీపీటీ వ్యాక్సిన్

భోగాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎస్సీబీసీ కాలనీకి చెందిన ఓ బాలికకు వేసిన డీపీటీ వ్యాక్సిన్ రియాక్షన్ ఇచ్చింది. భోగాపురం మండల విద్యావనరులకేంద్రం సమీపంలోగల ప్రాథమిక పాఠశాలలో బమ్మిడి శ్రావణి, సురేష్ దంపతుల కుమార్తె షమీర ఒకటో తరగతి చదువుతోంది. బుధవారం పాఠశాలకు వెళ్లిన తర్వాత పోలిపల్లి పీహెచ్‌సీ సిబ్బంది ఆరేళ్ల షమీరాకు డీపీటీ వ్యాక్సిన్ వేశారు. 45 నిమిషాలు నుంచి గంట వ్యవధిలో షమీర పాఠశాలలోనే పడిపోయి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. వ్యాక్సిన్ వేసిన సిబ్బంది సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఘోషాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం షమీర కోలుకుంది.కాగా షమీరకు వేసిన వ్యాక్సిన్ రియాక్షన్ ఇవ్వడానికి కారణం తెలియడంలేదని పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి మనస్విని తెలిపారు. క్షణాల్లో ఆసుపత్రికి తరలించి వైద్యం అందించామని, ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగాఉందని చెప్పారు. కాగా అందరి చిన్నారులకు వ్యాక్సిన్ వేయకుండా షమీరకు మాత్రమే ఎందుకువేశారని హెచ్ఎంను బంధువులు ప్రశ్నించారు.

హైందవ సంస్కృతిని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాసానంద స్వామి

రేగిడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైందవ సంస్కృతి కాపాడుకోవాలని గారపేట ఆనందాశ్రమం పీఠాధిపతి శ్రీనివాసానంద స్వామి కోరారు. బుధవారం రేగిడి దత్తపీఠంలో కార్తీక పౌర్ణమి పురష్కరించుకొని శివ, అయ్యప్పస్వామిలకు అన్నదానంతో పాటు ఆధ్యాత్మకప్రవచన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక దత్తపీఠం నిర్వాహకుడు కిమిడి సూరపనాయుడు, రవిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రామ్‌జీపాత్రో, సామంతుల దామోదర్‌రావు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సకాలంలో అందించాలి: జేసీ

విజయనగరం కలెక్టరేట్ నవంబరు 5(ఆంధ్రజ్యోతి) గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని సకాలంలో అందించాలని జేసీ కలెక్టరు సేతు మాధవన్ ఆదేశించారు. బుధవారం విజయనగరంలోని తన చాంబర్‌లో జిల్లాస్థాయిసప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం నిర్వహించారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా సరుకులను అందించేందుకు అవసరమైన చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలకు బాల సంజీవని పథకం లబ్ధిదారులకు సకాలంలోని సరుకులు అందెలా చూడాలని కోరారు.కార్యక్రమంలోని ఐసీడీఎస్ పీడీ విమలరాణి, సివిల్ సప్లయ్ డీఎం శాంతి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై సమీక్ష

భోగాపురం, నవంబరు5(ఆంధ్రజ్యోతి):ముంజేరు జనసేన కార్యాలయంలోఉపాధిహామీపథకంపై ఎమ్మెల్యే లోకం నాగమాధవి సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు ఎంపిక

గజపతినగరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగచోళ్లపెంట ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం. బంగార్రాజు తెలిపారు. విజయనగరంలో జరిగిన అండర్-17, అండర్-14 విభాగాల్లో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో గంగచోళ్ల పెంట పాఠశాలకు చెందిన టి.పూర్ణిమ, జె.దీక్షిత, ఎ.గౌరిశ్రీ, ఎస్.వినయ్ అండర్-17 విభాగంలో, జి.చందు, పి.జయింత్ అండర్ -14 విభాగంలో ఎంపికైనట్లు చెప్పారు. అండర్ -17కి ఎంపికైన విద్యార్థులు కాకినాడలో, బాలికలు విజయనగరంలో ఆడతారని అండర్ -14 విభాగానికి చెందిన విద్యార్థులు ఈనెల 23, 24, 25 తేదీల్లో కాకినాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

స్పిన్నర్ దేవేందర్..

లక్కవరపుకోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో చందులూరు పాఠశాలకు చెందిన స్పిన్ బౌలర్ సీహెచ్ దేవేందర్ అండర్-17 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీరాములు తెలిపారు. విజయనగరం విజ్జి స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్‌లో దేవేందర్ ఉత్తమ ప్రదర్శన చేశాడని తెలిపారు.

●విజయనగరం కలెక్టరేట్ నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఎస్సీ బాలురు వసతి గృహంలో తొమ్మిదోతరగతి చదువుతున్న కొర్రాపవన్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు పవన్‌కు వార్డెన్ గొర్లి సన్యాసిరావు అభినందించారు.

కబడ్డీ పోటీలకు..

గరివిడి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని విజ్జి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్‌లో కొండపాలెం జడ్పీ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న జి.ఉషశ్రీ అండర్-14 గర్ల్స్ కబడ్డీలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం డి.రాము, పీఈటీ విజయలక్ష్మి తెలిపారు.

ఎంపీడీవోగా కిశోర్‌కుమార్

దత్తిరాజేరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దత్తిరాజేరు ఎంపీడీవోగా కె.కిశోర్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. భోగాపురంలో ఎంపీడీవోగా ఉన్న ఆయన బదిలీపై దత్తిరాజేరు వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, టీడీపీ, వైసీపీ నాయకులు ఎంపీడీవోను అభినందించారు.

బాధితులకు సాయం

రాజాం/రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గుయ్యానవలసలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో బాధిత కుటుంబాలకు రాజాం రోటరీక్లబ్ చేయూతనందించింది. అధ్యక్ష, కార్యదర్శులు గట్టి పాపారావు, సప్పటి వసంతరావు సారథ్యంలో గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు బియ్యం, బట్టలు, వంట దినుసులు, స్టీల్‌పాత్రలు అందజేశారు. కార్యక్రమంలో రొటేరియన్స్ మక్క అప్పలనాయుడు, కొత్తా మదుసూదనరావు, జయదేవ్, శ్రీనివాసరావు, శాసపు సత్యనారాయణ, కిశోర్ పాల్గొన్నారు.

ఈగల్ టీం సేవలపై అవగాహన అవసరం

బొండపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈగల్‌టీం పోలీసులు అందజేస్తున్న సేవలు పట్ల విద్యార్థులకు అవగాహన అవసరమని ఈగల్ టీంహెచ్‌సీ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం బొండపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఈగల్ టీం సేవల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈగల్ టీం సిబ్బంది లక్ష్మణరావు, హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

స్నేహపూర్వకంగా మెలగాలి: డీఎస్పీ

భోగాపురం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా ఉండాలని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు సూచించారు. బుధవారం ముక్కాం హైస్కూల్‌లో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైం, బాల్య వివాహాలు, చెడువ్యసనాలు, తదితర అంశాలపై వివరించారు. ఈకార్యక్రమంలో సీఐ కె.దుర్గాప్రసాదరావు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల అభివృద్ధికి సహకారం: నాగార్జున

విజయనగరం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పీఏసీఎస్‌ల అభివృద్ధికి సహకరిస్తానని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున తెలిపారు. బుధవారం డీసీసీబీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఏసీఎస్‌ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, కావల్సిన నిధులు అందించి, అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. సంఘానికి వ్యవసాయ రుణాలు, ట్రేడర్ సరుకులు మంజూరుచేస్తామన్నారు. వీటితోపాటు సంఘాలు ఆర్థికంగా, వ్యాపార పరంగా ముందుకు వెళ్లేందుకు తగిన ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. పీఏసీఎస్‌ల త్రీమెన్ కమిటీలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

అయ్యప్పస్వామి పూజలకు ఏర్పాట్లు చేయండి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ఏర్పాట్లపై సూచనలిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం వ్యవశాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గురువారం నిర్వహించనున్న శ్రీపూర్ణపుష్కలాంబసమేత హరిహరసుత అయ్యప్పస్వామి విశేష పూజలకు ఏర్పాట్లు చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.ఈ మేరకు బుధవారం పూజా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాలతో పాటు మెంటాడ మండలం నుంచి పది వేల మందివచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, రామ్‌కుమార్, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

● విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



కలెక్టర్‌కు నియోజకవర్గ సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గతంలో విస్తరణ సమయంలో చేపట్టిన పలు రోడ్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్ రోడ్ల పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు సహకరించాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. బుధవారం కలెక్టరు రామసుందర్‌రెడ్డిని ఆయన చాంబర్లో కలిశారు. నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టరును కోరారు. వైఎస్సార్ నగర్‌కు వెళ్లే రహదారిలో వర్షం నీరు అధికంగా ఉండిపోవడంతో ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పెద్దచెరువు నుంచి నీరు పద్మావతి నగర్ మీదుగా బయటకు వెళ్లేందుకు వీలుగా కాలువ పనులు చేపట్టాలని కోరారు.

కార్పొరేషన్ల ద్వారా త్వరలో రుణాలు

●శృంగవరపుకోట ఎమ్మెల్యే లలితకుమారి



ఆటోను ప్రారంభిస్తున్న లలితకుమారి

లక్కవరపుకోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందిస్తుందని, వాటిని ఆయా కేటగిరిల వారీ ప్రజలు వినియోగించుకోవాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే లలితకుమారి కోరారు. బుధవారం లక్కవరపుకోటలో పీఎంఈజీపీ ద్వారా చినగుడిపాల, చామలాపల్లి, కొండగంగుబూడి గ్రామాలకు చెందిన ముగ్గురికిమంజూరైన ఆటోలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సబ్సిడీ రుణాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, జి.దేముడు, చల్లా వెంకటరావు, నిరుజోగి అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

బాలికల విద్యకు ప్రభుత్వం పెద్దపీట

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు



రాజాం: బాలికల హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న మురళీమోహనరావు

రేగిడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం బాలికావిద్యతో పాటు, యువతకు ఉపాధిఅవకాశాలకు పెద్దపీట వేస్తోందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు తెలిపారు. బుధవారం లక్ష్మీపురం హైస్కూల్‌కు అనుసంధానంగా రూ.1.94 కోట్లు అంచనాతో నిర్మించిన టైప్-4 కేజీబీవీ హాస్టల్ భవనసముదాయాలను డీఈవో మాణిక్యాలనాయుడు, సమగ్రశిక్ష పీవో రామారావుతో కలిసి ప్రారంభించారు.కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దార్ కృష్ణలత, ఎంఈవో వరప్రసాదరావు, టీడీపీనేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్, కర్నేన రమాదేవి, గౌరినాయుడు శంకర్, గురవాన రమేష్, రామినాయుడు పాల్గొన్నారు.

●రాజాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో మంత్రి నారా లోకేష్ కీలక సంస్కరణలుకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు తెలిపారు. బుధవారం సారది జడ్పీబాలికోన్నత పాఠశాల అనుబంధబాలికల వసతిగృహ భవనాన్ని, వస్త్రపురికాలనీలో రేషన్‌సబ్‌డిపోను ప్రారంభించారు. మునిసిపాలిటీ పరిధి లోని కొండంపేటలో, దేవుడమ్మ వీధిలో సిమ్మెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, పొట్నూరు లక్ష్మణరావు, మిత్తిరెడ్డి మదుసుదనరావు, డిఈఓ మాణి క్యాలనాయుడు, ఎంఈవో ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ పంపిణీయే ప్రభుత్వ లక్ష్యం

● విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అనకాపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలో గల 11 జిల్లాల్లో రూ.250 కోట్లతో 69 సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. బుధవారం ఆయన అనకాపల్లిలో రూ.5.5 కోట్లతో నిర్మించనున్న ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లాలోని కె.కోటపాడు మండలం చౌడువాడ, కింతలి గ్రామాల్లో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా చౌడువాడలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం విధించిన ఎఫ్‌పీపీసీఏ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ ప్రైస్ అడ్జస్ట్‌మెంట్) చార్జీ (యూనిట్‌కు) 40 పైసల నుంచి 27 పైసలకు తగ్గించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, కలెక్టర్ విజయకృష్ణన్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

కష్టబడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు



మంత్రి లోకేష్‌ను కలిసిన సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్‌కుమార్

నెల్లిమర్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడిన వారికి మంచి గుర్తింపు ఉంటుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. టీడీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, నెల్లిమర్ల మండలాధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ బుధవారం మంగళగిరిలో లోకేష్‌ను కలిసి పార్టీ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించి పలుసమస్యలు, అభివృద్ధి గురించి ఆయన దృష్టికి రవిశేఖర్ తీసుకువెళ్లారు. గతంలో వైసీపీ ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులను రవిశేఖర్ వివరించారు. రామతీర్థం ఘటనలో పోరాటం చేశారని రవిశేఖర్‌ను మంత్రి లోకేష్ అభినందించారు.

'మార్క్యుసెమీ'తో సెంచూరియన్ ఒప్పందం



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్‌రావు, సుప్రియా పట్నాయక్, ఉమేష్ మహంతి

పర్లాకిమిడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని సెంచూరియన్ యూనివర్సిటీ అదే రాష్ట్రంలోని బౌద్ధనగర్‌లో ఉన్న మార్క్యుసెమీ మరియే సిగ్నేచర్ ఐపీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎస్ రావు బుధవారం మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల విద్యార్థులకు వాస్తవ ప్రపంచ సెమీకండక్టర్ అనుభవం, పరిశ్రమ స్థాయి సాధనాలతో హ్యాండ్స్ ఆన్ శిక్షణ, డొమైన్ నిపుణుల మార్గదర్శకత్వాన్ని అందిస్తాయన్నారు.పరిశోధన, శిక్షణ, నైపుణ్య అభివృద్ధి, పరిశ్రమ మార్గదర్శకత్వం కోసం సమగ్ర కేంద్రంగా పని చేయడానికి ఈ ఒప్పందం ఎంతగానో దోహదపడుతుందన్నారు. వైస్‌చాన్స్‌లర్ సుప్రియా పట్నాయక్ మాట్లాడుతూ స్కేలబుల్ సిలికాన్ సిస్టమ్‌కోసం నూతనసాంకేతిక ఆవిష్కరణకు పరిశ్రమ అనుసంధానిత విద్యా ప్రయాణంలో మైలురాయిగా ఒప్పందాన్ని అభివర్ణించారు. మార్క్యుసెమీ-సిగ్నేచర్ ఐపీ సంస్థ ప్రతినిధి ఉమేష్ మహంతి మాట్లాడుతూ భారత్ సెమీ కండక్టర్ మిషన్, గ్లోబల్ పోటీ సామర్థ్యానికి తోడ్పడగల నైపుణ్యతగల ఇంజనీర్లను తయారీచే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్పా మునిసిపల్ పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా డీఈవో మాణిక్యం నాయుడు మాట్లాడుతూ విజయవాడలో ఈనెల ఏడోతేదీన బెంగళూరు విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలాజికల్ మ్యూజియం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఈ పోటీలకు ప్రథమ స్థానంలో నిలిచిన బొండపల్లి జడ్పీ పాఠశాల, రెండో స్థానం సాధించిన షికారుగంజి ఏపీ మోడల్ స్కూల్ తృతీయ స్థానంలో నిలిచిన రామచంద్రపురం జడ్పీ పాఠశాల ఎంపికయ్యాయని చెప్పారు. కార్యక్రమంలోని కస్పా పాఠశాల హెచ్ఎం విశాలాక్షి, జిల్లా సైన్స్ అధికారి రాజేష్, రిసోర్స్‌పర్సన్ బాను ప్రకాష్ పాల్గొన్నారు.



విజయనగరం కలెక్టరేట్: రాష్ట్రస్థాయి సైన్స్‌డ్రామా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో మాణిక్యంనాయుడు

నాసా శాస్త్రవేత్తలను కలుసుకోవడానికి ఎంపిక

జిల్లాలోని ఇటీవల జరిగిన సైన్స్ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులకు అపూర్వ అవకాశం దక్కింది. డెంకాడ మండలంలోని అక్కివరం ఏపీ మోడల్ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న పతివాడ భాను ప్రకాష్, వియ్యంపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివిన తెర్లంగి సంజనలను ఈనెల 6 నుంచి 8 తేదీ వరకూ ఢిల్లీలో నాసా,ఇస్రో శాస్త్రవేత్తలను కలుసుకోవడానికి ఎంపికయ్యారు. వీరిని బుధవారం విమానంలో పంపించినట్లు డీఈవో మాణిక్యం నాయుడు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి: డీఈవో

రాజాం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేయాలని డీఈవో మాణిక్యంనాయుడు కోరారు. బుధవారం రాజాం ప్రభుత్వోన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలించా రు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. పాఠశాలలో పదేళ్లపాటు చదువుకున్న ఓల్డ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు నాలుగు లక్షలతో నిర్మించిన మైత్రి వేదికను పరిశీలించారు. పాఠశాలకు సంఘ సభ్యులు చేపడుతున్న కార్యక్రమాల వివరాలను డీఈవోకు అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో డీసీఈబీ చైర్మన్ రాజు, ఎంఈవోలు ప్రవీణ్, దుర్గారావు పాల్గొన్నారు.

●రేగిడి, నవంబరు 5,(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదవాలని డీఈవో మణిక్యంనాయుడు కోరారు. లక్ష్మీపురం హైస్కూల్‌ను బుధవారం సమగ్రశిక్ష ఏపీసీ రామారావుతో కలిసి తనిఖీచేశారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణలత, ఎంపీడీవో శ్యామలాకుమారి, ఎంఈవోలు వరప్రసాదరావు, బి.ఏరకయ్య ఉన్నారు.

బాలికలు అక్కడ .. బాలురు ఇక్కడ!

(5వ పేజీ తరువాయి)

బాలురకు సరిపడా తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ప్రస్తుతం ఒక బోరుతోనే వారు అవస్థలుపడాల్సి వస్తోంది. ఇక పాఠశాల భవనాల వెనుక భాగం నుంచే అడారిగెడ్డ ప్రవహిస్తోంది. దీంతో వర్షాలు కుసిన ప్రతిసారీ పాఠశాల ఆవరణ వెనుక భాగం క్రమక్రమంగా కోతకు గురవుతోంది. దీనివల్ల భవిష్యత్‌లో భవనాలు బీటలు వారి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలో ప్రహరీ కంటే రక్షణగోడను బలంగా నిర్మించాలని, అదేవిధంగా తాగునీరు, వసతి సమస్యలపై స్పందించాలని విద్యార్థులు, ఉపాధ్యా యులు కోరుతున్నారు.

నిర్మాణాలు పూర్తయితే తరలిస్తాం..

'అనసభద్రలో రెండో అంతస్థులో పది గదులు, ప్రహరీ నిర్మాణం పూర్త యిన వెంటనే కొటిక పెంట పాఠశాలలో చదువుతున్న 144మంది బాలికలను ఇక్కడకు తరలిస్తాం. తాగునీటికోసం రెండు బోర్లను తక్షణమే ఏర్పాటు చేయాల్సి ఉంది. పాఠశాల వెనుక భాగం నుంచి అడారిగెడ్డ ప్రవహిస్తున్నందున 250మీటర్ల వరకు రక్షణ గోడను నిర్మించాలి.' అని ఏకలవ్య ప్రిన్సిపాల్ కె.సురేష్ తెలిపారు.

జడ్పీ విభజన జరిగేనా?

(5వ పేజీ తరువాయి)

అదే ఏడాది సెప్టెంబరులో వచ్చాయి. అప్పటి నుంచి జడ్పీ నూతన పాలకవర్గం అమల్లోకి వచ్చింది. కాగా గత వైసీపీ ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గాల ప్రతిపాదికగా కొత్త జిల్లాలను 2022, ఏప్రిల్ 4న ఏర్పాటు చేసింది. ఈక్రమంలో విజయనగరం జిల్లాలో సాలూరు, పార్వతీపురం, కురుపాం, శ్రీకాకుళం జిల్లాలో పాలకొండ నియోజక వర్గాలతో పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడింది. విజయనగరం జిల్లా సైతం శ్రీకాకుళం నుంచి రాజాం (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గం కలుపుకుని ఎస్.కోట, గజపతినగరం, చీపురుపల్లి, నెల్లిమర్ల, బొబ్బిలి, విజయనగరం, సాలూరు అసెంబ్లీలో మెంటాడతో కొత్త జిల్లాగా ఏర్పడింది.

● విజయనగరం జిల్లా విభజన చేసిన తర్వాత అప్పటికే కొత్త పాలకవర్గాలతో కొలువు దీరిన జడ్పీని రెండుగా విభజించడానికి న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి. దీంతో జిల్లాను విభజించినా ఉమ్మడిగా జిల్లా పరిషత్‌ను కొనసాగించారు. జడ్పీ సమావేశాలను సైతం ఉమ్మడిగానే కొన సాగిస్తున్నారు. ఉమ్మడి విజయనగరంలో 34 జడ్పీటీసీలు, 549 ఎంపీటీసీ స్థానాలు ఉండేవి. జిల్లాల విభజన తర్వాత శ్రీకాకుళం జిల్లా నుంచి పాలకొండ, భామిని, వీరఘట్టం, సీతంపేట మన్యంలో, వంగర, రేగిడి రామభద్రపురం, రాజాం, సంతకవిటి మండలాలు విజయనగరంలో కలి శాయి. శ్రీకాకుళం జడ్పీ సమావేశాలకు పాలకొండ, రాజాం అసెంబ్లీల పరిధిలో ఉన్న జడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు వెళ్తున్నారు. విజయనగరం జడ్పీ సమావేశాలకు సాలూరు, కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల పరిధిలో పరిధిలో ఉన్న జడ్పీటీసీలు, మంత్రి, ఎమ్మెల్యేలు వెళ్తున్నారు.

● పార్వతీపురం మన్యం జిల్లాలో 15, విజయనగరం జిల్లాలో 27 మండలాలున్నాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఏ జిల్లాల పరిధిలోకి వస్తాయనేది స్పష్టత ఉంది. ఇదిలా ఉండగా జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రుల ఉపసంఘం గత నెల 29న సమావేశమైంది. బుధవారం కూడా సచివాలయంలో ఇదే అంశంపై చర్చించింది. ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలనే ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదిస్తే మెంటాడ మండలం మళ్లీ పార్వతీపురం మన్యం జిల్లాలో కలవనుంది. అలా కలవకపోయినా 15 జడ్పీటీసీ స్థానాలతో కొత్తగా పార్వతీపురంమన్యం జిల్లాలో జిల్లా పరిషత్ ఏర్పడే అవకాశముంది. 27 లేదా 26 (మెంటాడ మండలం పార్వతీపురం మన్యం జిల్లాలో కలిపితే) జడ్పీటీసీ స్థానాలతో విజయనగరం జడ్పీ ఉంటుంది. ఏదేమైనా ఉమ్మడి జడ్పీ విభజనకు అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పాలకొండను జిల్లాగా మార్చండి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న భూదేవి

పాలకొండ, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలి, లేదా శ్రీకాకుళం జిల్లాలో కలపాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి కోరారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం మండలంలోని కల్లేపల్లిలో ఆయన్ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పాలకొండను జిల్లా చేస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. జిల్లాల పునర్విభజన జరిగిన నష్టాన్ని పూడ్చడానికి తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. కార్య క్రమంలో పాలకొండ జిల్లా సాధన సమితి సభ్యులు బుడితి అప్పలనాయుడు, కనపాక చౌదరినాయుడు, సబ్బ నానాజీ, తుమ్మగుంట శంకరరావు, రుంకు రామకృష్ణ, వల్లూరు సత్యనారాయణ, కూటమి నాయకులు గుమ్మడి సింహాద్రి, పవన్‌సాయి, అక్కలనాయుడు, వెన్నపు వెంకటరమణ, దుంపల రమేష్‌బాబు, దుప్పాడ గణేష్, శాసను సర్వారావు, గుమ్మడి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించండి

పార్వతీపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీతాలు చెల్లించాలని కోరుతూ బుధవారం డ్వామా పీడీ రామచంద్రరావుకు ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఏలు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. గతంలో జీతాలను అడ్మిన్ అకౌంట్ ద్వారా అందించేవారన్నారు. తాజాగా మెటీరియల్ కాంపోనెంట్ నుంచి జీతాలు చెల్లించాలని ఉన్నతాధికారులు నిర్ణయించడంతో మూడు నెలలుగా జీతాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్స్, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు బదిలీ

జియ్యమ్మవలస, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస తహసీల్దార్ వై.జయలక్ష్మికి బుధవారం బదిలీ అయ్యింది. ఆమెను కలెక్టరేట్‌లో హెచ్-సెక్షన్‌కు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలానికి వచ్చిన ఆరు నెలల్లోనే ఆమె బదిలీ కావడం చర్చనీయాంశమైంది. ఇక్కడ తహసీల్దార్‌గా కలెక్టరేట్ హెచ్-సెక్షన్‌లోని ఎస్.అప్పారావును నియమించారు.

నాటిక పోటీలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వాసుదేవరావు మాస్టారు

జియ్యమ్మవలస, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): పెద మేరంగి కూడలిలోని ఓ ప్రైవేట్ స్కూల్ ఆవరణలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో ఆంధ్ర, తెలంగాణ (తెలుగు) రాష్ట్రాల నాటిక పోటీలను జయప్రదం చేయాలని మేరంగి నాటక పరిషత్ అధ్యక్షుడు రౌతు వాసుదేవరావు మాస్టారు ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పెదమేరంగిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న కరీంనగర్ వారిచే స్వప్నం రాల్చిన అమృతం నాటిక, చిలకలూరిపేట వారిచే మా ఇంట్లో మహా భారతం నాటిక ప్రదర్శితం కానున్నాయన్నారు. 8న విశాఖ వారిచే అసత్యం నాటిక, గుంటూరు వారిచే గారడి నాటిక, 9న హైదరాబాద్ వారిచే అమ్మ చెప్పిన బొమ్మ నాటిక, చినమేరంగి వారిచే మనిషి కన్నా శవం మిన్న నాటిక ప్రదర్శనలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రౌతు విజయ్‌కుమార్, కోశాధికారి రౌతు అజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.కిశోర్‌కుమార్, ఉపాధ్యక్షుడు బలగ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

సహజ వ్యవసాయ పద్ధతులతో మేలు



వ్యవసాయ పద్ధతులను పరిశీలిస్తున్న దృశ్యం

సీతంపేట రూరల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): సహజ వ్యవసాయ పద్ధతులు అవలంబించడం ద్వారా నేల సంరక్షణతో పాటు ఆరోగ్యం, ఆహార అభివృద్ధి జరుగుతుందని నాబార్డు జనరల్ మేనేజర్ పహాడ్‌సింగ్ అన్నారు. సీతంపేట ఏజెన్సీలోని బూర్జగూడ, గుజ్జి, దుగ్గి, చిన్నపొల్ల, జయపురంగూడ, గడిగుజ్జి గ్రామాల్లో విదేశీ ప్రతినిధులతో కలిసి ఆయన పర్యటించారు. గిరిజన గ్రామాల్లో నాబార్డు సహకారంతో ఆర్ట్స్ సంస్థ ద్వారా చేపడుతున్న జీవ కార్యక్రమాలు, సహజ వ్యవసాయ పద్ధతులు, నేల సంరక్షణ, పాత విత్తన రక్షణ వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ రైతులకు భవిష్యత్తు తరాల్లో రసాయనిక పురుగు మందులు లేని వ్యవసాయ ప్రాంతాలు తయారు చేస్తామన్నారు. పరిశీలనలో విదేశీ ప్రతినిధులు కన్సల్టెంట్ ఉజ్వల దండేకర్, నాబార్డు డీడీఎం దినేష్‌కుమార్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రేఖ, మాతోట ఎఫ్‌పీవో రవీంద్రనాథ్ బట్లు, మన్యం జిల్లా సహజ సీఈవో శంకర్రావు, కో-ఆర్డినేటర్ సందీప్, జీవ కో-ఆర్డినేటర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను అమలు చేయండి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ భారత్ మహాసభ జిల్లా కన్వీనర్ బిడ్డిక రమణమూర్తి డిమాండ్ చేశారు స్థానిక ఎల్విన్‌పేట సెంటర్‌లో రెండో రోజు బుధవారం నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజను చట్టాల అమలుకు భంగం కలిగించే విధానాలపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దీక్షలో జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, పత్తిక మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్‌ను నియమించండి

గరుగుబిల్లి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): తోటపల్లికి ఆశావర్కర్‌ను నియమించాలని సర్పంచ్ ఆవాల సింహాచలమమ్మ కోరారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇక్కడి విధులు నిర్వహించే ఆశా వర్కర్ ఏడేళ్ల కిందట మృతి చెందిందన్నారు. నేటికీ ఆ స్థానంలో ఆశా వర్కర్‌ను నియమించలేదన్నారు. దాంతో గర్భిణులు, బాలింతలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్థానికంగా ఆశావర్కర్ లేకపోవడంతో గ్రామానికి చెందిన వితంతు మహిళకు నెలవారీ కొంత మొత్తం చెల్లిస్తూ సేవలందేలా చూస్తున్నట్టు చెప్పారు. ఆశా వర్కర్‌ను నియమించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగదీశ్వరి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఆశా వర్కర్‌ను నియమించాలని కోరారు.

గిరిజన యువతకు ప్రాధాన్యమివ్వరా?

సీతంపేట రూరల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యాటక ప్రాంతాలైన ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్, మెట్టుగూడ జలపాతం వద్ద అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేయనున్న ఫుడ్ స్టాల్స్, పర్యాటక ప్రాంతాలు వీక్షించేందుకు పర్యాటకులను తీసుకుపోయే ఆటో, మ్యాక్సీ క్యాబ్‌ల కోసం గిరిజన యువతకు ప్రాధాన్యత ఇవ్వరా అని ఏజేఏసీ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాటాడారు. గిరిజనుల అభివృద్ధి కోసం పాటుపడాల్సిన ఐటీడీఏ అధికారులు గిరిజన నిరుద్యోగ యువతను విస్మరించడం సరికాదన్నారు.

9న ప్రతిభా పరీక్ష

పాలకొండ/ వీరఘట్టం, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి టాలెంట్ హంట్ పరీక్షను ఈ నెల 9న ఆదివారం పాలకొండ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు పాలకొండ, వీరఘట్టం, బూర్జ, రేగిడి, ఆమదాలవలస, వంగర మండలాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ముగ్గురు చొప్పున పదో తరగతి విద్యార్థులు హాజరు కావాలని కోరారు. విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందజేయనున్నారు.

బాల్య వివాహలను నిర్మూలిద్దాం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీనివాసరావు

పార్వతీపురం టౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలన మనందరి బాధ్యత అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అప్‌హోల్డ్ సంస్థ ఆధ్వర్యంలో లైన్స్ ట్రస్టు, ప్రజా సంకల్ప వేదిక సహకారంతో బాల్య విహహాల నిర్మూనలకు సంబంధించిన ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు 2024లో ఇచ్చిన తీర్పు ప్రకారం బాల్య వివాహాలను 2030 నాటికి నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలన్నారు. ఎస్‌వీడీ కళాశాల ప్రిన్సిపాల్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ చలపతిరావు మాట్లాడుతూ బాల్య వివాహల నిరోధనానికి పోలీసు శాఖతో పాటు న్యాయ వ్యవస్థ కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహల సమాచారాన్ని హెల్ప్‌లైన్ 112తో పాటు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అప్‌హోల్డ్ జిల్లా సమన్వయకర్త బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పార్వతీపురం టౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధి కారి జి.వి.రమణ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యా లయ ఆవరణలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.

రహదారిలో గోతుల పూడ్చివేత

గరుగుబిల్లి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారిలో గోతులు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దాంతో సంతోషపురం సర్పంచ్, రాష్ట్ర నాటక అకాడమి బోర్డు డైరెక్టర్ అంబటి రాంబాబు స్పందించారు. సొంత నిధులు వెచ్చించి రోడ్డులో గోతులను పూడ్చివేతను నిర్ణయించారు. బుధవారం రహదారి వెంబడి గోతుల్లో కంకరను వేయించి రోలింగ్ చేయించారు.

సచివాలయ సెక్రటరీ సస్పెన్షన్

పాచిపెంట, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల విషయంలో అలసత్వం వహించిన పాచిపెంట-1 సచివాలయ సెక్రటరీ గర్బాపు దీపక్‌ను సస్పెండ్ చేశామని ఎంపీడీవో బీవీకే పాత్రో ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటి పన్నుల వివరాలు నమోదులో అలసత్వం, ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయడం నిర్లక్ష్యం చేయడం వల్ల సెక్రటరీని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు.

ఇద్దరు విద్యార్థులకు పచ్చకామెర్లు

● శ్రీకాకుళం రిమ్స్‌కు తరలింపు

సీతంపేట రూరల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): సీతంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పచ్చకామెర్లు వ్యాధి బారిన పడ్డారు. అనారోగ్యానికి గురైన ఏడో తరగతి విద్యార్థులు మండంగి గౌతమ్, కూరంగి వరుణ్‌లను బుధవారం పాఠశాల సిబ్బంది వైద్య పరీక్షల నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు విద్యార్థులకు పచ్చకామెర్లు ఉన్నట్లు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు.